
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 17.091 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 17.091 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,990
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,747
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,919
నవర (8 గ్రాములు)	రూ.47,352

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.8 /24.6
బుధవారం గాలిలో తేమ 67 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు నిలకడగా ఉన్నాయి. గురువారం మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ఐబీ బృందం పల్లిపాడు డైట్ సందర్శన



పల్లిపాడు డైట్‌లో ఐబీ ప్రణాళిక బృందం

ఇందుకూరుపేట: పల్లిపాడు ప్రభుత్వ డైట్ (జిల్లా విద్యా శిక్షణా సంస్థ) కళాశాలను ఇంటర్నేషనల్ బాకలారియెట్ (ఐబీ) విద్యా ప్రణాళికా బృందం బుధవారం పరిశీలించింది. ఈ బృందంలో ఇంగ్లండ్‌కు చెందిన ఎడిక్ బాబర్, అమెరికాకు చెందిన వెండి గ్రీన్, ఎస్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ గిరిబాబు యాదవ్, నెల్లూరు డీసీఈబీ సెక్రటరీ టి.రామ్‌కుమార్ ఉన్నట్లు డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు సైన్స్ ప్రయోగశాల, గ్రంథాలయం, డిజిటల్ క్లాస్ రూమ్, ఆడిటోరియం, సెమినార్ హాల్, తరగతి గదులు, మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఆర్.బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలి

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



మాట్లాడుతున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం: విద్యార్థినీ, విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలని వీఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ జీఎం సుందరవల్లి సూచించారు. కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1928 సంవత్సరం ఫిబ్రవరి 28న భారతీయ భౌతిక శాస్త్రవేత్త సి.వి రామన్ కాంతి, పదార్థాన్ని గ్రహించే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చి ఒక దృగ్విషయాన్ని ఆవిష్కరించారని తెలియజేశారు. సి.వి రామన్ ఆవిష్కరణ వివిధ రంగాలలో సుదూర ప్రభావాలను కలిగించిందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రామన్ భౌతిక శాస్త్రానికి సంబంధించి వివిధ అంశాలపై అనేక పరిశోధనలు చేశారని కొనియాడారు. ఆ పరిశోధనల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, అధ్యాపకులు సీహెచ్ విజయ, టి.వీరారెడ్డి, వెంకట్రాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కందిపప్పు పంపిణీ

నెల్లూరు(పొగతోట): జిల్లాలోని గోదాముల్లో అందుబాటులో ఉన్న నిల్వలతో మార్చి 1వ తేదీ నుంచి కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుబాటులో ఉన్న నిల్వలతో వాహనాల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తామన్నారు. పూర్తి స్థాయిలో సరఫరా రాకపోవడంతో కందిపప్పు పంపిణీలో జాప్యం జరుగుతోందన్నారు. ఏప్రిల్ నెల నుంచి పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని తెలిపారు.

అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



క్రైస్తవ మత ప్రచారకుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి క్రైస్తవ సోదరులు అండగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నరుకూరు సెంటర్‌లోని రిషీ గ్రాండ్ కళ్యాణ మండపంలో జరిగిన తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల క్రైస్తవ మత ప్రచారకుల ఆత్మీయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ మతాలకతీతంగా అందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను సమాన దృష్టితో అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల పార్టీ అధ్యక్షులు ఉప్పల శంకరయ్య గౌడ్, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆశలూరిస్తున్న పొగాకు



ఈ ఏడాది పొగాకు పంటపైనే రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. గతేడాది వచ్చిన రికార్డు ధరలతో... ఈసారి అధిక విస్తీర్ణంలో పంటను రైతులు సాగు చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ఇతర పంటల సాగుకు వాతావరణం అంతగా అనుకూలించకపోవడం, అదే సందర్భంలో పొగాకు సాగుకు అనుకూలంగా ఉండడంతో రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపారు.

నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 2023-24 సీజన్‌లో 74 వేల హెక్టార్లలో సాగు

- 2022-23 పంట సీజన్‌లో 69 వేల హెక్టార్లలో సాగు
- ఈ ఏడాది 5 వేల హెక్టార్లలో అదనం
- 11 వేలం కేంద్రాల పరిధిలో 89.9 మిలియన్ కేజీల పొగాకు విక్రయించుకునేందుకు బోర్డు అనుమతి
- ధరలపై ఆశలు రేకెత్తిస్తున్న కర్ణాటక మార్కెట్



పొగాకు పంట

సాక్షి, నెల్లూరు డెస్క్: పొగాకు సాగు ఈ ఏడాది రైతులకు లాభాలు కురిపించే అవకాశం ఉంది. కర్ణాటకలో ఈ పంటకు వేలంలో మంచి ధరలు లభించడంతో ఇక్కడి రైతులు కూడా వేలంపై ఆశగా ఎదురుచూస్తున్నారు. 2023–24 ఏడాది పంట సీజన్‌లో నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 74 వేల హెక్టార్లలో పొగాకు సాగైంది. ఆకు దిగుబడి తగ్గినా క్యూరింగ్‌లో పొగాకు నాణ్యత మెరుగ్గా ఉండడం రైతులకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. కర్ణాటకలో క్వింటాకు రూ.28 వేల ధర పలకడంతో ఇక్కడ రైతులు ధరలపై కోటి ఆశలు పెట్టుకున్నారు. పొగాకు బోర్డు ప్రకాశం రీజియన్ పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటిలో ప్రకాశం జిల్లా పరిధిలో 7 వేలం కేంద్రాలుంటే, జిల్లాలోని కందుకూరులో రెండు, డీసీపల్లి, కలిగిరి వేలం కేంద్రాలున్నాయి. ఈ వేలం కేంద్రాల పరిధిలో 2022–23 సీజన్‌లో రికార్డు ధరలు వచ్చాయి. కేజీ పొగాకు సరాసరిన రూ.214 వరకు ధర పలికింది. దీంతో రైతులకు గత సీజన్ సిరులు కురిపించింది. ఈ నేపథ్యంలో 2023–24 ఏడాదిలో కూడా పొగాకు భారీగా సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగానే 11 వేలం కేంద్రాల పరిధిలో దాదాపు 74 వేల హెక్టార్లలో పొగాకు సాగైంది. 2022–23 ఏడాదిలో ఇది 69 వేల హెక్టార్లు మాత్రమే. గతేడాది కంటే దాదాపు 5 వేల హెక్టార్లలో ఈ ఏడాది ఎక్కువగా సాగైంది.

నాణ్యత బాగుంది

దిగుబడులు తగ్గినా క్యూరింగ్‌లో పొగాకు నాణ్యత మెరుగ్గా ఉండడం రైతులకు ఊరట కలిగించే అంశం. క్యూరింగ్‌లో దాదాపు 70 శాతం పొగాకు బ్రైట్ గ్రేడ్ దిగుబడి వస్తుండగా, 20 శాతం వరకు లోగ్రేడ్, మిగిలినవి ఇతర గ్రేడ్‌లు వస్తున్నాయని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. బ్రైట్ గ్రేడ్ ఉంటేనే రైతులకు అధిక లాభాలు వస్తాయి. 2023–24 పంట సీజన్‌కు సంబంధించి 89.9 మిలియన్ కేజీలు పొగాకును అమ్ముకునేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే గత సీజన్‌లో బోర్డు అనుమతిని మించి దాదాపు 123.10 మిలియన్ కేజీల వరకు పొగాకు అమ్మకాలు సాగాయి. దిగుబడులు కాస్త తగ్గినా అదే సమయంలో సాగు విస్తీర్ణం పెరగడం వల్ల ఉత్పత్తి తగ్గదని అంచనా వేస్తున్నారు.

తగ్గిన దిగుబడులు

పొగాకు సాగులో ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నా అదే సందర్భంలో మార్కెట్ ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఆ పంట వైపే మొగ్గు చూపుతున్నారు. గతం కంటే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితి నెలకొనడంతో సాగు ఖర్చులు రెట్టింపయ్యాయి. ఒక ఎకరా పొగాకు సాగు చేసి ఉత్పత్తి చేతికొచ్చే సరికి రూ.1.30 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు చెప్తున్నారు. ప్రధానంగా కూలీల రేట్లు పెరగడం, నీటి తడుల కోసం వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుండడంతో సాగు ఖర్చు విపరీతంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దిగుబడులు సక్రమంగా ఉంటేనే లాభాలు వస్తాయని లేదంటే నష్టాలు చవి చూడాల్సి వస్తుందంటున్నారు. వర్షాభావం వల్ల సక్రమంగా నీరు అందుబాటులో లేకపోవడం వల్ల దిగుబడి ఈ ఏడాది కాస్త తగ్గుతోందని అంచనా వేస్తున్నారు. గతేడాది ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే అది ఈ ఏడాది 5 నుంచి 6 క్వింటాళ్లకు మాత్రమే పరిమితమవుతోంది.

జిల్లాలో మార్చి 6న పొగాకు వేలం ప్రారంభం

2023–24 పంట సీజన్‌కు సంబంధించి జిల్లాలో పొగాకు వేలం మార్చి 6వ తేదీ ప్రారంభించాలని నిర్ణయించారు. వాస్తవానికి బోర్డు ప్రకాశం రీజియన్ పరిధిలో మొదటి విడతగా ఈనెల 29వ తేదీనే ఒంగోలు వేలం కేంద్రంలో ప్రారంభం కానుంది. నెల్లూరు జిల్లాకు వచ్చే సరికి కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో మార్చి 6వ తేదీ ప్రారంభించనున్నారు. ఆ తరువాత మూడో విడతలో కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల్లో వేలం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పొగాకు ధరలపై రైతులు ఇప్పటికే కోటి ఆశలు పెట్టుకున్నారు. కర్ణాటక మార్కెట్‌లో బ్రైట్ గ్రేడ్ పొగాకు కేజీ ధర అత్యధికంగా రూ.290 వరకు పలకడం, సరాసరి ధర రూ.254 వరకు రావడంతో అదే ధరలు ఇక్కడా వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మంచి ధరలే రావచ్చు

ఈ ఏడాది పొగాకు వేలం మార్చి 6వ తేదీ ప్రారంభించాలని బోర్డు అధికారులు నిర్ణయించారు. ఏడాది దిగుబడి కొద్దిగా తగ్గినా ఆ మేరకు క్వాలిటీ పెరిగింది. కావున ధరలపై రైతులు ఆశలు పెట్టుకోవడం సహజం. త్వరలోనే వేలం ప్రారంభం ప్రారంభమై పొగాకునకు మంచి రేటు పలికి రైతులకు లాభాలు వస్తాయని ఆశిస్తున్నాను.

– రాజగోపాల్‌రెడ్డి, కందుకూరు 2వ వేలం కేంద్రం నిర్వహణాధికారి

అన్నదాతలకు అండగా..

- జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి
- జిల్లాలో రైతు భరోసా, పీఎం కిసాన్, సున్నా వడ్డీ నిధులు విడుదల
- 2,20,749 మంది రైతుల ఖాతాల్లో రూ.45.28 కోట్లు జమ చేసిన సీఎం
- 17,631 మంది రైతులకు పంట రుణాలు, సున్నావడ్డీ నగదు రూ.3.88 కోట్లు జమ



వైఎస్సార్ రైతు భరోసా చెక్కును అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి, కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ 5వ ఏడాది మూడో విడత నిధులను, సున్నా వడ్డీ పంట రుణాల నిధులను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయగా ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం హరినారాయణన్, నిరంజన్ బాబురెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. జిల్లాలో 5వ ఏడాది 3వ విడత 2,20,749 మంది రైతులకు రూ.45.28 కోట్లను, రూ.లక్ష లోపు పంట రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 17,631 మంది రైతులకు సున్నా వడ్డీ నగదు రూ.3.88 కోట్లను అన్నదాతల బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు అతి కీలకమైన పథకం రైతు భరోసా అని, వ్యవసాయ ఖర్చులకు పెట్టుబడి సాయంగా రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం రైతు భరోసా – పీఎం కిసాన్ నగదు అందజేస్తుందన్నారు. విత్తనం నాటడం నుంచి ధాన్యం అమ్ముకునే వరకు ప్రతి అడుగులోనూ అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ అని చెబితే, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పండుగలా మార్చి చూపించారని చెప్పారు. రైతులకు గ్రామస్థాయిలోనే అన్ని సేవలు అందిస్తూ సాంకేతికంగా వారికి తోడ్పాటునందించేలా రైతు భరోసా కేంద్రాలను నెలకొల్పిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. ఉచిత పంటల బీమా ద్వారా రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించి రైతుకు అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. అలాగే ఏ సీజన్‌లో జరిగిన నష్టాన్ని ఆ సీజన్ ముగిసేలోగా రైతుల ఖాతాలకు జమ చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ హరినారాయణన్

వ్యవసాయ సీజన్‌కు ముందుగానే రైతులకు పెట్టుబడి సాయంగా ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా నేరుగా వారి ఖాతాలకు ప్రభుత్వం నగదును జమ చేస్తుందని, వ్యవసాయానికి మేలు జరిగేలా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రైతు భరోసా పథకాన్ని అందజేస్తున్నామని, ఏదైనా సమస్యతో నిధులు జమ కాని వారు వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం జిల్లాలో రైతులకు సంబంధించిన రైతు భరోసా, సున్నా వడ్డీ నిధుల విడుదల నమూనా చెక్కులను రైతులతో కలసి ఆవిష్కరించారు.

రైతుకు ఇంత సాయం ఎవరూ చేయలేదు



మా గ్రామంలో నేను 4 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. నాకు క్రమం తప్పకుండా రైతు భరోసా డబ్బులు పడుతున్నాయి. గతంలో లాగా ఎవరి చుట్టూ తిరగకుండా నేరుగా సేవలు అందుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా చాలా మంది ముఖ్యమంత్రులను చూశాం. కానీ జగన్ లాంటి ముఖ్యమంత్రిని ఇంత వరకు చూడలేదు. రైతులకు జగన్ లాగా ఎవరూ మంచి చేయలేరు.

– గునపాటి మధుసూదన్‌రెడ్డి, ఆలూరుపాడు, కొడవలూరు మండలం

చెప్పినవన్నీ చేస్తున్నారు



గతంలో ముఖ్యమంత్రులు చెప్పినవన్నీ పూర్తిగా చేయలేదు. కానీ ఒక్క జగన్ మాత్రమే చెప్పిన ప్రతి మాట తప్పకుండా చేస్తున్నాడు. ముసలోళ్లకు, పిల్లలకు, ఆడోళ్లకు, నాలాంటి పేద రైతులకు అన్నీ చేస్తున్నాడు. నాకు రైతు భరోసా ఎంతో ఉపయోగపడుతోంది. మా గ్రామంలోని రైతు భరోసా కేంద్రం ఎంతో ఉపయోగపడుతోంది. ధాన్యం ఉత్పత్తి కూడా ఎక్కువగా వచ్చి ఈ ఏడాది మంచి ధర పొందాను.

– యాదగిరి పుల్లయ్య, నల్లగొండ గ్రామం, ఉదయగిరి మండలం

కందుకూరు సమన్వయకర్తగా బుర్రా



కందుకూరు: వైఎస్సార్‌సీపీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్తగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. 2014లో కందుకూరు నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన మధుసూదన్ యాదవ్ అప్పట్లో పార్టీ సమన్వయకర్తగా కూడా వ్యవహరించారు. ఆ తరువాత పార్టీ సీట్ల సర్దుబాటులో భాగంగా 2014లో కనిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పార్టీ అధిష్టానం అవకాశం కల్పించింది. ఆ ఎన్నికల్లో ఓటమి పాలైనా, తిరిగి 2019 ఎన్నికల్లో కనిగిరి నుంచే మరోసారి పోటీచేసి భారీ మెజార్టీతో విజయ సాధించారు. 2024 ఎన్నికలను పురస్కరించుకుని సీట్ల సర్దుబాటులో భాగంగా మరోసారి కందుకూరు నియోజకవర్గానికి బుర్రాను సమన్వయకర్తగా అధిష్టానం నియమించింది. దీంతో ఎక్కడి నుంచి అయితే రాజకీయ ప్రస్థానం ప్రారంభించారో అదే కందుకూరులో రాజకీయంగా మరోసారి బుర్రా కీలకం కానున్నారు. ఈ నేపథ్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వహిద్దాం

- ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేద్దాం
- అభ్యర్థుల ఖర్చు వివరాలు నమోదు చేయాలి
- సిబ్బందికి శిక్షణలో కలెక్టర్ హరినారాయణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరు (దర్గామిట్ట): త్వరలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం నెల్లూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఎన్నికల నిర్వహణపై మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్‌పై అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సార్వత్రిక ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిబ్బంది విధులు, బాధ్యతలపై ఎన్నికల విధులు కేటాయించిన వారికి నుడా వీసీ బాపిరెడ్డి, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, ఆడిట్ ఆఫీసర్ తిరుపతయ్య, ఎన్ఐసీ అధికారి సురేష్ వివరించారు. శిక్షణ కార్యక్రమం అనంతరం కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూఎన్నికల ప్రక్రియలో ఎన్నికల నియమావళి అమలు చేయడం, అభ్యర్థుల ఖర్చు వివరాలు నమోదు చేయడం చాలా కీలకమైన అంశాలుగా పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 49 మంది అధికారులు హాజరుకాలేదని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ విధుల్లో ఏ ఒక్కరు ఏ చిన్న తప్పు చేసినా అది మొత్తం ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపి రీపోలింగ్‌కు దారి తీస్తుందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను నిర్వర్తించాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరిగినా ఫిర్యాదు వచ్చినా నేరుగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందని, మళ్లీ విధుల్లో చేరాలన్నా ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎన్నికల విధులు కేటాయింపబడిన ప్రతి ఒక్కరూ గురుతర బాధ్యతగా ఎన్నికల విధులను నిర్వహించేందుకు సమాయత్తం కావాలన్నారు. ఏ చిన్న సందేహం ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈఎస్ఎంఎస్, సీ విజిల్ యాప్‌లపై పూర్తిస్థాయిలో సంసిద్ధం చేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు ఎక్స్‌పెండిచర్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోజు అన్ని బృందాల సభ్యులు ఫొటో, వీడియోలను తప్పనిసరిగా ఆర్‌ఓకు పంపాలన్నారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఎటువంటి మినహాయింపు కోరవద్దని సూచించారు.

నిబంధనల ప్రకారం సీజ్ చేయాలి: ఎస్పీ

ఎన్నికల నిబంధనల మేరకు తనిఖీల్లో పట్టుబడిన నగదు, మద్యం, ఇతర సామగ్రిని సీజ్ చేయాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. సీజ్ చేసిన వాటిపై ఎఫ్ఐఆర్ ఫైల్ చేసేటప్పుడు టీంలోని సభ్యులందరూ సంతకాలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వికాస్‌మర్మత్, ఏఎస్పీ సౌజన్య, డీఆర్‌ఓ లవన్న, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ సంజనా సింహా, ఆత్మకూరు ఆర్డీఓ మధులత, రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో విద్యార్థి డిబార్

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు వర్సిటీ ఎగ్జామ్స్ నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్. మధుమతి తెలిపారు. మొత్తం 7,798 మందికి గానూ 7,211 మంది హాజరై.. 587 మంది గైర్హాజరని వెల్లడించారు. వెంకటగిరిలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని డిబార్ చేశారన్నారు.



పొదలకూరు నిమ్మధరలు (కిలో)
పెద్దవి : రూ.75
సన్నవి : రూ.60
పండు : రూ.22

సీహెచ్‌సీలో వైద్యం.. అధునాతనం

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించడం వల్ల పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోంది. ఎన్నో ఏళ్లుగా బాగుపడని వైద్యశాలల్లో ఇప్పుడు శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నారు. ఖరీదైన వైద్యం రూపాయి ఖర్చులేకుండా అందుబాటులోకి వచ్చింది. గత ప్రభుత్వంలో మందులు, పరికరాలు, డాక్టర్ల కొరత ఉండేది. ప్రజలు సైతం ప్రభుత్వ వైద్యంపై విముఖత చూపేవారు. అయితే వాటికి భిన్నంగా ఇప్పుడు పరిస్థితులున్నాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను నాడు–నేడు పథకంలోకి తీసుకు రావడంతో బాగుపడ్డాయి.

- పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొత్త రూపు
- ఎక్స్‌రే, స్కానింగ్, బ్లడ్ టెస్ట్‌లు చేస్తున్న వైనం
- గుండెపోటు బాధితులకు అందుబాటులో ఇంజక్షన్
- రోగులకు భోజన సదుపాయం
- రాత్రి వేళల్లో అందుబాటులో వైద్యులు

పొదలకూరు: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజూ చుట్టుపక్కల మండలాల నుంచి ఎంతోమంది వస్తుంటారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ సీహెచ్‌సీ రూపురేఖలు మారిపోయాయి. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకున్నారు. దీంతో మందులు, పరికరాలను అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమికంగా ఆక్సిజన్‌ను అందించేందుకు దాతల సహకారంతో ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందుబాటులోకి తెచ్చారు. గుండెపోటు బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించడం కోసం అత్యంత ఖరీదైన ఇంజక్షన్‌ను ఇక్కడ ఉంచారు.

మార్పులిలా..

ఈ కేంద్రంలో వైద్యులు, నర్సుల సంఖ్య పెరిగి పేదలకు వైద్యం అందుతోంది. అంతేకాక ఇక్కడ ఇన్‌పేషెంట్‌గా చేరే వారికి, గర్భిణులకు భోజనం అందిస్తున్నారు. గర్భకోశ వ్యాధి నిపుణులు ఒకరు, చిన్నపిల్లల వైద్యనిపుణులు ఒకరు, మత్తు వైద్యుడు ఒకరు, దంత, ఫిజియోథెరపీకి ఒక్కొక్కరు, జనరల్ సర్జన్ ఒకరు, కాంట్రాక్ట్ డాక్టర్ ఒకరు, వైఎస్సార్ కంటి వెలుగు కింద వైద్యుడు ఒకరు, స్టాఫ్ నర్సులు ఏడుగురు ఉన్నారు. అసిస్టెంట్ సర్జన్ ఒకరు ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతిపై జనరల్ ఫిజీషియన్ ఉండగా ఉన్నత చదువులకు వెళ్లడంతో నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ఓపీ బాగా పెరిగింది. స్థానికంగానే కాకుండా కలువాయి, రాపూరు, చేజర్ల మండలాల నుంచి నిత్యం 250 మంది విచ్చేస్తున్నారు. అధునాతమైన పరికరాలతో అన్ని రకాల రక్తపరీక్షలను చేస్తున్నారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్యం అందుతోంది. సీహెచ్‌సీలో రాత్రివేళల్లో సేవలు అందించేందుకు ఒక డాక్టర్, ఒక నర్సు, ఒక అటెండర్ అందుబాటులో ఉన్నారు.



ఆస్పత్రికి విచ్చేసిన ప్రజలు (ఫైల్)

గతేడాది మే నెలలో ఎక్స్‌రే, బ్లడ్‌బ్యాంకు, స్కానింగ్ సెంటర్లను మంత్రి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. బ్లడ్‌బ్యాంక్ అత్యవసరమని చుట్టుపక్కల మండలాల వారికి కూడా ఉపయోగపడుతుందని ఏర్పాటు చేయించారు.

శస్త్రచికిత్సలు కూడా ఇక్కడే..

శస్త్రచికిత్సలను కూడా చేస్తున్నారు. అదనపు ఆపరేషన్ థియేటర్‌ను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ అపెండిసైటిస్ (24 గంటల కడుపునొప్పి), కుటుంబ నియంత్రణ, హైడ్రోసిల్ తదితర ఆపరేషన్లను చేస్తున్నారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచేందుకు కాంట్రాక్టు పద్ధతిపై పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఆయుష్మాన్‌భవ కింద ఇటీవల వరుసగా మూడు వారాలు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి సంబంధిత వైద్యుల ద్వారా సేవలను అందించారు.

మార్పులు వచ్చాయి



కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా సీహెచ్‌సీలో చాలా మార్పులు వచ్చాయి. హెచ్‌డీసీ (ఆస్పత్రి అభివృద్ధి కమిటీ) చైర్మన్‌గా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల చాలా సౌకర్యాలు ఏర్పడ్డాయి. పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చింది.

– వాకాటి శ్రీనివాసులురెడ్డి, హెచ్‌డీసీ మెంబర్, పొదలకూరు

అందుబాటులో సిబ్బంది



సీహెచ్‌సీలో అన్ని రకాల రక్త పరీక్షలు, సౌకర్యాలు, నిపుణులైన డాక్టర్లు ఉన్నారు. పేదలెవరూ ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దు. విజయవంతంగా శస్త్రచికిత్సలు కూడా చేయిస్తున్నాం. అన్ని పరికరాలు అందుబాటులో ఉండబట్టే ఇది సాధ్యమవుతోంది. రాత్రి వేళల్లో ఒక డాక్టర్, నర్సు వైద్యసేవలను అందించేందుకు ఉంటారు.

– డాక్టర్ రమేష్‌నాథ్, డీసీహెచ్ఎస్, నెల్లూరు



పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రిలో పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 156
లేయర్ (లైవ్)	: 72
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 122

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు (క్రైమ్): నగరంలోని కొండాయపాళెం గేటుకు సమీపంలోని రైలు పట్టాల వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతను ట్రైన్ ఢీకొని చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. తెలుపు రంగుపై.. పసుపు రంగు గీతల ఫుల్ హ్యాండ్స్ షర్టు, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు డ్రైవర్‌పై దాడి

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరులో ముగ్గురు వ్యక్తులు బస్సు డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ ఘటన మంగళవారం జరగ్గా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై వీరేంద్రబాబు కథనం మేరకు.. కోవూరు మండలం పోతిరెడ్డిపాళేనికి చెందిన గుంజి శ్రీనివాసులు నెల్లూరు – కొరుటూరు ఆర్టీసీ బస్సుకు డ్రైవర్‌గా ఉన్నాడు. కరిముల్లా అనే కండక్టర్‌తో కలిసి నెల్లూరు నుంచి కొరుటూరుకు ప్రయాణికులతో బయలుదేరాడు. దారిలో డేవిస్‌పేటకు వచ్చేసరికి ఓ వ్యక్తి బస్సును ఆపాడు. అయితే అతను ఎక్కకుండా వెళ్లిపోమని చెప్పాడు. దీంతో డ్రైవర్ శ్రీనివాసులు కొరుటూరుకు బయలుదేరాడు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చేసరికి బస్సు ఆపిన వ్యక్తితోపాటు మరో ఇద్దరు కలిసి మోటార్‌బైక్‌ను రోడ్డుకు అడ్డుగా నిలిపారు. డ్రైవర్ వాహనాన్ని ఆపగా లోపలికి వెళ్లి కండక్టర్‌ను దుర్భాషలాడారు. శ్రీనివాసులుపై దాడి చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందగా నిందితులను డేవిస్‌పేట చెందిన వెంకటేష్, సాయికుమార్, మౌళిగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

ప్రతి గడపకు జగనన్న సంక్షేమ పథకాలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి గడపకు చేరాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. విజయీభవ యాత్రలో భాగంగా బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. ఏపిలగుంటలో ఎంపీటీసీ సభ్యులు నాయుడు హజరత్‌రెడ్డి, రసం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. చిలకపాడులో జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచ్ రమాదేవి ఆధ్వర్యంలో మేకపాటిని భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సోమశిల జలాలను హైలెవల్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండల ప్రజానీకానికి అందించి సస్యశ్యామలం చేయడం వైఎస్ జగన్ లక్ష్యమని, అది త్వరలో నెరవేరుతుందని చెప్పారు. మెట్ట ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కల సాకారం కానుందన్నారు. చిలకపాడు, ఏపిలగుంట గ్రామాల్లో సంక్షేమాభివృద్ధికి రూ.11.86 కోట్ల నిధులు అందజేశామన్నారు. లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.9.21 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అభివృద్ధికి రూ.2.65 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణాలను చేపట్టామని వివరించారు.



ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

ప్రణాళికలు తెలియజేస్తున్నాం

రానున్న ఐదేళ్ల కాలంలో గ్రామాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని తప్పకుండా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని, లేదంటే మళ్లీ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి గడపకు సంక్షేమం చేరాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందుగా ఏపిలగుంటలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ కాలువలను ప్రారంభించారు. చిలకపాడులో బల్క్‌మిల్క్ సెంటర్ నిర్మాణం పూర్తి కావడంతో దాని ప్రారంభోత్సవం నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణాలతోపాటు వాటర్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు రామ్మోహన్, రవీంద్రబాబునాయుడు, సర్పంచ్ కటకం నారసింహారావు, శ్రీనివాసులురెడ్డి, రమేష్, అబ్బిరెడ్డి, కాశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో గ్యాంగ్ ట్రాప్‌లో పడొద్దు



మహిళలతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: 'వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఎల్లో గ్యాంగ్ అనేక హామీలిస్తోంది. వారి ట్రాప్‌లో ప్రజలు పడొద్దు' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొండాయపాళెంలో బుధవారం ఆయన విజయసంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలన్నారు. చంద్రబాబు వస్తే పథకాలను తీసేస్తాడన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలవడానికి ఏ అబద్ధమైనా ఆడేందుకు బాబు సిద్ధంగా ఉన్నాడని, ఆయన మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. తెలుగుదేశం నేతలు డబ్బులతో ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తారని వారిని పట్టించుకోవద్దని సూచించారు. తాను ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌ది ఈ దేశం కాదని, ఆయన్ను కలుసుకోవాలంటే సాధ్యమయ్యే పనికాదన్నారు. కనీసం ఈ ఎన్నికలు జరిగేలోపైనా మీ ఊరికి వస్తాడో రాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. అలాంటి వ్యక్తికి ఓటు వేసి మోసపోవద్దని సూచించారు. 2019 ఎన్నికల సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, నేతలు జి.శ్రీనివాసులురెడ్డి, గోగుల వెంగళరెడ్డి, ముర్తుజా హుస్సేన్, గడియాల్చి ఎస్దానీ, ఉప్పుటూరి శ్రీను పాల్గొన్నారు.

ఐసీఏఐ నూతన కమిటీ నియామకం



ప్రమాణ స్వీకారం చేస్తున్న రాజేష్

వెంకటాచలం: నెల్లూరు బ్రాంచ్ ఆఫ్ ఎస్ఐఆర్‌సీ (సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్) ఆఫ్ ఐసీఏఐ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్) నూతన కమిటీ ప్రమాణ స్వీకారం వెంకటాచలం టోల్‌ప్లాజా వద్దనున్న ఐసీఏఐ భవన్‌లో బుధవారం జరిగింది. కమిటీ చైర్మన్‌గా యువ రాజేష్, వైస్ చైర్మన్‌గా సుధా మహేష్, సెక్రటరీగా బాలఓబులు, ట్రెజరర్‌గా అరుణకుమార్ నియమితులయ్యారు. ఐసీఏఐ చైర్‌పర్సన్ గీత, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్లు ప్రసన్నకుమార్, దయానివాస్ శర్మ, సునీల్‌కుమార్, సుబ్బారావు, చెంగల్‌రెడ్డి సమక్షంలో నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది.

పేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్ తెలిపారు. నగరంలోని 42వ డివిజన్ మన్సూర్‌నగర్ తదితర ప్రాంతాలు, అలాగే 52వ డివిజన్ రంగనాయకులపేట రైలుకట్ట వీధి, పెద్దతోట తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి గడపకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను వివరిస్తున్నట్లు వెల్లడించారు. తమకు అందాయని, సంతోషంగా ఉన్నామని ప్రజలందరూ చెబుతున్నారన్నారు. నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. జగనన్న సంక్షేమ పథకాల వల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. వచ్చే ఎన్నికలు పెత్తందారులు, పేదలకు మధ్య జరుగుతున్నట్లు చెప్పారు. సిటీ వాసులకు అందుబాటులో ఉంటానని, సామాన్యుడినైన తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ కరిముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్